
రోజూ వెయ్యిమంది విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ భోజనం

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్షయపాత్ర ఫౌండేషన్ భాగస్వామ్యంతో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) వెయ్యిమంది విద్యార్థులకు ఏడాదిపాటు భోజనసదుపాయం కల్పించాలని నిర్ణయించింది. శనివారం బెంగళూరులో ఫౌండేషన్ కార్యాలయంలో హెచ్‌పీసీఎల్ ఈడీ రాజీవ్‌గోయెల్, అక్షయపాత్ర ఫౌండేషన్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ధనంజయ్ గంజు ఒప్పందంపై సంతకాలు చేశారు. అక్షయపాత్ర దేశవ్యాప్తంగా సేవలందిస్తోందని తాము వెయ్యిమందికి సీఎస్ఆర్‌లో భాగంగా సమకూర్చదలిచినట్లు రాజీవ్‌గోయెల్ పేర్కొన్నారు.

బృహత్ బెంగళూరు నగర పాలికె కార్యాలయం





పాలకులు కరువైన

పాలికె

● నాలుగేళ్లుగా బీబీఎంపీ ఎన్నికలపై స్తబ్ధత

● శివమొగ్గ, మైసూరు ఎన్నికల్లోనూ జాప్యం
● కార్పొరేటర్లు లేక కుంటుపడిన పాలన
● అధికారుల ఇష్టారాజ్యం
● సామాన్యులకు అందని సేవలు

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు బలోపేతం కావాలన్నా ప్రాంతాలవారీగా ప్రజలు ఎదుర్కొనే సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలన్నా పాలకమండలులు ఉండాలి. స్థానిక సంస్థల్లో గ్రామపంచాయతీ, తాలూకా, జిల్లా, నగర, మహానగర పాలికెలకు ఐదేళ్లకోసారి గడువులోగానే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలో పేరొందిన మహానగర పాలికెలకు పాలకులు లేక ప్రజాసమస్యలు పట్టించుకునేవారే కరువయ్యారు. స్థానిక సంస్థల పాలకమండలులకు ప్రాధాన్యం ఇవ్వాలనేది రాజ్యాంగం ఆశయం. అయితే రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా సాగుతోంది. ఓవైపు జిల్లా పంచాయతీలకు ఐదేళ్లుగా ఎన్నికలు జరగలేదు. మరోవైపు రాష్ట్రంలోనే ప్రముఖ నగరాలుగా పేరొందిన మహానగర పాలికెలకు ఎన్నికల గ్రహణం పట్టింది. రాజధాని బెంగళూరు, మైసూరు, శివమొగ్గ, తుమకూరు మహానగర పాలికెలకు ఎన్నికలు జరిపేలా గెజిట్ జారీ చేస్తామని ఆగస్టులోనే రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పాలకవర్గం గడువు ముగిసేందుకు ముందుగానే రిజర్వేషన్లు, ఓటరు జాబితా ఇతరత్రా ప్రక్రియ సిద్ధం చేసుకోవాలని వీటి తర్వాత ప్రక్రియలో భాగంగా రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు జరపాలని స్పష్టత ఉంది. అయితే పాలికె ఎన్నికలు జరిపేందుకు ప్రారంభంలో ఎన్నికల కమిషన్ ఉత్సాహం చూపింది. ఆ తర్వాత మౌనంగా ఉండడంతో ఎన్నికల ప్రక్రియ జాప్యమవుతోందనే విమర్శలు ఉన్నాయి. బృహత్ బెంగళూరు నగర పాలికె (బీబీఎంపీ) ఎన్నికల జాప్యానికి ఎన్నో అడ్డంకులున్నాయి. రెండేళ్లక్రిందటి ప్రభుత్వం వార్డుల విభజన, రిజర్వేషన్, వంటి ప్రక్రియదాకా వెళ్లింది. అయితే కోర్టు కేసులు ఉండడంతో వాయిదా పడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులు గత బీజేపీ ప్రభుత్వం నిర్ణయించిన వార్డుల విభజన సరిలేవని వార్డుల సంఖ్యను మార్పు చేసింది. అయితే కొలిక్కి తీసుకొచ్చేందుకు ఉత్సాహం చూపలేదు.

కొత్త షెడ్యూల్ ప్రకటించాలి

పాలికె, జిల్లా ఎన్నికల విభాగాలు ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే జాబితాలు సిద్ధమయ్యాయి. వాటిని ఎన్నికల కమిషన్‌కు పంపి నెలలు ముగిశాయి. దీంతో ఓటరు తుదిజాబితా గడువు కూడా ముగిసింది. కానీ ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ విభాగం స్థానిక సంస్థలకు ఓటరు జాబితాను పంపలేదు. ఓటరు జాబితాలో సవరణలు, అభ్యంతరాలను సవరించి తుది జాబితాను సెప్టెంబరు 17లోగా ప్రకటించాల్సి ఉండేది. ప్రక్రియ ముగిసి రెండు నెలలైంది. ఓటరు జాబితాలో నమోదు నిరంతరంగా సాగుతున్న తరుణంలో పాత జాబితాను ప్రకటించే అవకాశం ఉండదు. కొత్త జాబితాలో అభ్యంతరాలకు అవకాశం ఇచ్చి ప్రకటించాల్సి ఉంది. శివమొగ్గ మహానగర పాలికెలో వార్డుల విభజన ప్రస్తావన పంపారు. అనుమతులు లభించడం జాప్యమైంది. శివమొగ్గ పాలికె గడువు ముగిసి ఏడాది అవుతోంది. ఇక్కడ ప్రజా ప్రతినిధులు లేక అభివృద్ధి పనులకు అంతరాయం ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శివమొగ్గలోనూ అదే దుస్థితి

శివమొగ్గ పాలకవర్గం గడువు 2023 నవంబరు 28తో ముగిసింది. మైసూరు మహానగర పాలికె పాలకవర్గం గడువు 2023 నవంబరు 16కు ముగిసింది. తుమకూరు పాలకవర్గం 2024 జనవరి 29తో ముగిసింది. అయితే బెంగళూరు మహానగర పాలికె అత్యధికంగా నాలుగేళ్ల పాలకవర్గం లేకుండానే ముగిసింది. 2020 సెప్టెంబరు 10తో పాలకవర్గం గడువు ముగిసింది.

పాలకవర్గాలతోనే ప్రగతి

ఎన్నికలు జరిగితే ప్రజల చెంతకు వెళ్లాల్సి ఉంటుందని ప్రజా ప్రతినిధులు సమస్యలపై స్పందించేవారని ప్రస్తుతం అధికారులదే పెత్తనం కావడంతో ఇటీవలే బదిలీపై వచ్చామని, నిత్యం మీటింగ్‌లు ఉన్నాయని, మరికొన్ని రోజుల్లో బదిలీపై వెళ్తామని కుంటి సాకులు చెబుతూ కూడా పరిష్కారానికి ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పట్లో బెంగళూరు పాలికెకు ఎన్నికలు జరుగుతాయనే ఆశ ఆమడదూరంలో ఉన్నట్లు అనిపిస్తోంది.



శివమొగ్గ కార్పొరేషన్ కార్యాలయం

4 ఏళ్లుగా అందని సేవలు



బీబీఎంపీ పాలకవర్గం లేక నాలుగేళ్ల బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కు ఎన్నికలు లేకుండానే నాలుగేళ్లు ముగిసింది. 2020 సెప్టెంబరు 10 నాటికి పాలకవర్గం గడువు ముగిసింది. అప్పటినుంచి అధికారులే పాలన సాగిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా గెలుపొందిన కార్పొరేటర్లు లేకుండా నాలుగేళ్లు గడిచిపోవడం బీబీఎంపీ చరిత్రలో ఇదే ప్రథమం. వార్డుల పునర్విభజన నెపంతో ఎన్నికలను వాయిదా వేస్తున్నారు. బెంగళూరు పరిధిలో కొన్నేళ్లుగా 198 వార్డులకు కార్పొరేటర్‌లు ఉండేవారు. నగరంలో 28మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే ఎన్నికలు జరిగితే కార్పొరేటర్లు వస్తారని దాదాపు ఎమ్మెల్యేలందరూ ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మఠాధిపతులు

రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలను

ఖండిస్తున్నాం

● వక్ఫ్ బోర్డును రద్దు చేయాలి
● ఒక వర్గానికే మద్దతు సరికాదు
● మఠాధీశుల ఆగ్రహం

బళ్లారి సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఒక వర్గానికి మేలు కలిగేలా వ్యవహరించడం తగదని, రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని మఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని కొట్టూరు స్వామి మఠంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొట్టూరు సంస్థాన్ మఠం బసవలింగస్వామి, కళ్యాణ మఠం శ్రీనుతో సహా మఠాధీశుల ధర్మ పరిషత్ నుంచి పాల్గొన్న వివిధ మఠాధీశులు మాట్లాడారు. 2017 నుంచి పరిషత్ పని చేస్తోందని సమాజంలో ముఖ్యంగా రైతుల సమస్యలపై పోరాడుతునే ఉన్నామన్నారు. కుల మతాలకు అతీతంగా మండలి పని చేస్తోందన్నారు. నరేగల్ మఠంలోని 11ఎకరాలను వక్ఫ్‌గా మార్చారు. పహాణీపై పోరాడి తిరిగి తెచ్చుకున్నామన్నారు. ఈజిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వక్ఫ్‌గా రైతుల ఆస్తులు, మఠాలు, దేవాలయాలకు నోటీసులు వస్తున్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనే ఏ రైతు అయినా తమ పరిషత్‌ను సంప్రదిస్తే నైతికంగా మద్దతిస్తామన్నారు. శాంతితోట అయిన కర్ణాటకాలో అశాంతి సృష్టిస్తున్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా చట్టం ఉండాలి. వక్ఫ్ అంటే దానికి వ్యతిరేకంగా కోర్టులో దావా వేయలేని చట్టమని, ఇలాటి వక్ఫ్‌బోర్డును తక్షణమే రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీతో వచ్చి రెండు వేలుఇచ్చి ఇప్పుడు రైతుల భూములు లాక్కునే పని చేస్తోందన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వంపై రాజ్యాంగబద్ధంగా పోరాడుతామన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య మేల్కొని ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేవలం ఒక వర్గానికే పాలకులుగా వ్యవహరించడం సరి కాదన్నారు. అందరి సహకారంతోనే ప్రభుత్వ మనుగడ సాధ్యమని గమనించాలన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే 7019550844 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఈవిషయంపై ముఖ్యమంత్రికి రాసిన విజ్ఞాపన పత్రాన్ని మఠాధీశుల పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాకలెక్టర్‌కు అందజేస్తున్నట్లు తెలిపారు. కొట్టూరు చానోటి మఠం సిద్దలింగ శ్రీను మాట్లాడుతూ సమాజాన్ని ముభ్యపెట్టే పని ప్రభుత్వం చేపట్టరాదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వక్ఫ్ తనదేనని క్లెయిమ్ చేసేందుకు పత్రాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కించపరిచేలా ప్రభుత్వం తీర్మానాలు చేయడం సరికాదని, వక్ఫ్ బోర్డు పేరుతో రైతులకు నోటీసులు జారీ చేస్తూ గందరగోళం సష్టించడాన్ని సహించడమని మఠాధీశుల ధర్మ పరిషత్ ప్రభుత్వంపై మండిపడింది. ఇకనైనా ప్రభుత్వం తన ధోరణి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. విలేకరుల సమావేశంలో బళ్లారి, విజయనగరం జిల్లాల నాయకులు, తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరుపురుషోత్తమగౌడ, అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బిచ్చగల్లు పంచాక్షరప్ప, ప్రధాన కార్యదర్శి వీరేష్ గంగావతి, మసీదీపూర్ సిద్రామనగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలకే కొట్టుకుపోయిన వంతెన

● రూ.6.5కోట్లు వృథా ● నాసిరకం పనులపై సర్వత్రా ఆగ్రహం

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వంతెన మూడు నెలలకే కొట్టుకుపోయింది. బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా మాంజరి గ్రామం పరిధిలో కృష్ణానదికి అనుబంధంగా 6.5 కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెన మూడు నెలలకే కొట్టుకుపోయింది. మాంజరి - భవన- సందత్తిల మధ్య బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్‌ను నిర్మించారు. తద్వారా నదికి ఇరువైపులా సంచారానికి అనుకూలమైంది. వంతెన లేకి కాలంలో వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలు నిలిచిపోయేవి. రాయభాగ, చించళి, కుడచి, దిగ్గేవాడి గ్రామాల మధ్య సంచారానికి అనుకూలంగా ఉండేలా ఈ వంతెనను నిర్మించారు. మూడు నెలలక్రితమే దీనిని ప్రారంభించారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల తాకిడి తాజాగా వరద పోటెత్తడంతో వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. నాసిరకం పనులతో వంతెన నిర్మించినందునే వంతెన కొట్టుకుపోయిందని స్థానికుడు సిద్దార్థ గాయగోడ్ మండిపడ్డారు. వంతెన దుస్థితిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అథణి చిన్ననీటి పారుదలశాఖ ఏఈఈ లమాణి స్పందిస్తూ సంబంధిత గ్రామాలకు త్వరలోనే రాకపోకలకు అనుకూలమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.



చిక్కోడి తాలూకాలో కొట్టుకుపోయిన వంతెన



హొసపేటలో కొలువుదీరిన పాతకాలం నాటి కార్లు...

పాత కారు..

పరుగులు..జోరు

● హంపికి చేరుకున్న వింటేజ్ కార్ల ప్రదర్శన ● ఏళ్లు గడిచినా అదే స్పీడు ● పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ప్రయాణం

బళ్ళారి గాంధీనగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుందరమైన, చారిత్రక, పురాతన పర్యాటక ప్రాంతాలను సందర్శించడంలో పాటు శతాబ్దాల నాటి 'వింటేజ్' వాహనాలను గొప్ప వారసత్వాన్ని దేశంలోని సుదూర ప్రాంతాలకు పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన టూర్ శనివారం హొసపేట చేరుకుంది. హొసపేట నగరం, హంపికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఫెడరేషన్ ఆఫ్ హిస్టారిక్ వెహికల్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌హెచ్‌వీఐ) బెల్జియం ఆధారిత డెస్టినేషన్ ర్యాలీతో పాటు 'ఎక్స్‌ప్లోర్ కర్ణాటక హిస్టారిక్ డ్రైవ్ 2024 ' పేరుతో ఈ పాతకాలపు కార్ల పర్యటనను ప్రారంభించింది. ఈ 21న చిక్కమగళూరు, కొడుగు, మైసూరు మీదుగా బెంగళూరు తిరుగు ప్రయాణమవుతారు. ఇటలీ, దక్షిణ ఆఫ్రికా, లిథువానియా, పోర్చుగల్, ఐర్లాండ్, జర్మని, బెల్జియం, ఫిన్లెండ్, అమెరికా, నెదర్లాండ్, బ్రిటన్, ఆస్ట్రేలియాకు దేశాలకు చెందిన 20 కార్లు, గోవా నుంచి పడవలో వచ్చాయి. హుబ్బళ్లి మీదుగా హంపికి చేరుకున్నాయి. ఇక్కడ నుంచి రెండు జట్లు సమావేశమై ఆదివారం ఉదయం చిక్కమగళూరుకు బయల్దేరుతాయి. ప్రపంచ వారసత్వ ప్రదేశాలకు పాతకాలపు కార్లను తీసుకురావడమే తమ యాత్ర ఉద్దేశం అని ఎఫ్‌హెచ్‌వీఐ ప్రెసిడెంట్ డాక్టర్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. పర్యాటక శాఖ మంత్రి హెచ్.కె. పాటిల్ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

శుక్రవారం బెంగళూరులోని మెథడిస్ట్ చర్చి ఎదురుగా భారతదేశంలోని 20 పాతకాలపు కార్ల పర్యటనను పర్యాటక శాఖామంత్రి హెచ్‌కే పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్లు సాయంత్రానికి హొసపేట నగరానికి చేరుకోగా ఇక్కడి రాయల్ ఆర్కిడ్ హోటల్‌లో ఈ బ్యూటీ ఆఫ్ ది సెంచరీ స్థానికులను ఆకర్షించింది. పాత కార్లను టెక్నీషియన్లు సరి చేయగానే యథావిధిగా పరుగులు తీయడం ఆశ్చర్యపరిచింది. పాత కార్లలో 1926 బెంట్లీటూరర్, 1933 ఆల్విస్ స్పీడ్, 1939 చేవ్రొలెట్ మాస్టర్ డీలక్స్ లిమోసిన్, 1947 సిట్రోయెన్ ట్రాక్షన్, చేవ్రొలెట్ ఫ్లీట్ మాస్టర్, 1950 ఎంజి వైట్, 1952 బెంట్లీ ఎమ్కెఎస్, ఎల్, 1955. 1956 డాడ్జ్ సబర్బన్ కస్టమ్, 1962 జాగ్వార్, ఎంకె 2, 1967 ట్రయంఫ్ జీటీ6, 1968 మెర్సిడెస్ పగోడా280ఎస్‌ఎల్, 1969 ఆల్ఫారోమియో స్పైడర్, 1970 మెర్సిడెస్ 280ఎస్‌ఎల్, 1972 వోక్స్‌వ్యాగన్ మైక్రోబస్, 1972 పోర్షే 911, 1974 జాగ్వార్ ఇ.టైప్‌వీ12, 1975 లాన్సియా, 1980 కోర్వెట్‌స్టింగ్రే ప్రత్యేకమైన అనుభూతిని అందించాయి.

అహ్మదాబాద్‌కు చెందిన ఎంజీ వైటీ 'లాల్‌ప్యారీ' కారు యజమాని డామన్ ఠాకోర్ ఇదే కారులో గత ఏడాది 73 రోజుల పాటు భారత దేశం నుంచి లండన్‌కు ప్రయాణించారు. 12వేల కిలోమీటర్ల ప్రయాణంలో ఆయన 12 దేశాలను సందర్శించారు.

బాలింతల మృతిపై

సీఎం ఆరా

బళ్లారి నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి గోషా ఆసుపత్రిలో ప్రసవానికి వచ్చిన బాలింతల మృతిపై సీఎం ఆరా తీశారు. ఘటనపై విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్‌ను సూచించారు. మంత్రి జమీర్ బళ్లారి డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో శనివారం ఫోన్‌లో మాట్లాడారు. గర్భిణుల మృతిపై విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మృతిచెందిన బాలింతల కుటుంబాలకు రూ.2 పరిహారం పరిహారం అందజేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. విమ్స్‌లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు బాలింతల పరిస్థితి విషమంగానే ఉందని తెలుస్తోంది.

మంత్రి జమీర్ వ్యాఖ్యలు

సరికాదు

● డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రి జమీర్ అహ్మద్ కుమారస్వామిని 'కరియ' అని పిలువు సరికాదని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. కేంద్రమంత్రి కుమారస్వామి పట్ల అటువంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. శనివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఏమైనా పిలుచుకోని కానీ పార్టీ అధ్యక్షుడిగా జమీర్ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయనపై చర్యల విషయం తర్వాత పరిశీలిస్తామన్నారు. కానీ ఇదే విషయంలో మంత్రి వ్యాఖ్యలను సీఎం సిద్దరామయ్య సమర్థించారు. జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ నన్ను దించుతానని, తన ప్రభుత్వాన్ని కూలుస్తానన్న వ్యాఖ్యలు సమంజసనమైనవేనా అని ప్రశ్నించడం తెలిసిందే. మాజీ ఎంపీ, డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ కూడా మంత్రి వ్యాఖ్యలు సమర్థించారు. కానీ డీసీఎం డీకే శివకుమార్ ఒక్కడే సరికాదని అభిప్రాయపడ్డారు.

టెక్ సమ్మిట్‌కు అంతా

సిద్ధం

● ఆన్‌బౌండ్ థీమ్‌తో వినూత్న ఏర్పాట్లు
● 19 నుంచి ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ప్రారంభం

7



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ప్రియాంక్ ఖర్గే

రూ 65 కోట్ల ఆస్తి స్వాధీనం

7

● ఆక్రమణలపై జేపీ నగర్‌లో బీడీఏ కార్యాచరణ



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

సమాన అవకాశాలకే ఉద్యమం

మూడు దశాబ్దాల పోరాటం విజయవంతం
అమరులు, నాయకులు, కార్యకర్తలకు అంకితం
మాదిగల ఆత్మీయ సదస్సులో మందకృష్ణ మాదిగ

అనంతపురం సెంట్రల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో విజయం సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు, రాష్ట్రంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు నేపథ్యంలో నగరంలోని లలిత కళాపరిషత్‌లో మాదిగల ఆత్మీయ సదస్సును శనివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ ఉపకులాలన్నింటికీ సమాన అవకాశాలు దక్కాలన్న ఆకాంక్షతో వర్గీకరణ ఉద్యమం చేశామని అన్నారు. ఈ ఉద్యమంలో అనేకమంది అమరులయ్యారని, లక్షలాదిమంది నాయకులు, కార్యకర్తలు శ్రమించారని అన్నారు. పోరాటాల ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణను గతంలోనే చంద్రబాబు అమలు చేశారని, దీంతో అనేక మంది మాదిగలకు విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కాయని అన్నారు. దీనికి వ్యతిరేకంగా మాలలు కోర్టుకెళ్లడంతో మళ్లీ ఉద్యమం చేపట్టాల్సి వచ్చిందని, చివరకు విజయం సాధించామని అన్నారు. ఈ విజయాన్ని మాలలు వ్యతిరేకించడం సరైందికాదని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఏర్పాటైన కమిషన్లు ఎస్సీ వర్గీకరణ సరైందేనని నివేదికలు ఇచ్చాయని అన్నారు. రాష్ట్రపతులు, ప్రధానులు మాదిగల డిమాండ్ న్యాయమైదని అభిప్రాయపడ్డారని గుర్తు చేశారు.


మాదిగల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మందకృష్ణ

స్వాగతిస్తున్నాం

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని మందకృష్ణ మాదిగ అన్నారు. పదిరోజుల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. కులం పేరు చెప్పుకోవడానికి ఒకప్పుడు సిగ్గుపడినవారు.. నేడు సగర్వంగా పేర్లకు ముందు, వెనకా మాదిగ అని పెట్టుకుంటున్నారని అన్నారు. ఇందుకు సహకరించిన న్యాయవ్యవస్థకు, ప్రధాని నరేంద్రమోదీకి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలని అన్నారు.

తరలివచ్చిన మాదిగలు

ఆత్మీయ సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి, లలితాకళాపరిషత్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మందకృష్ణను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, శంకర్, ఎల్లప్ప, గంగాధర్, అమర్నాథ్, కదిరప్ప, రమేష్, ఆంజనేయులు, నాగేంద్ర నాథ్, స్వంత్రకుమారి, సునీత, ఉపాధ్యాయ సంఘం నాయులు పెద్దన్న, నాగభూషణం, నారాయణ, ఎస్కేయూ ఉద్యోగ సంఘం నాయకులు నారాయణ, సంజీవప్ప, దేవరాజు, లక్ష్మయ్య అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన మాదిగలు


తూంచెర్లలో నీట మునిగిన వరి పంట


వరిని ముంచిన వర్షం

అల్ప పీడనం కారణంగా కురిసిన వర్షాలు వరి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కనగానపల్లి మండలంలో మూడు రోజులపాటు భారీ వర్షం కురిసింది. దీంతో కోత దశలో ఉన్న వరి పంటలు నీట మునిగాయి. తూంచెర్ల గ్రామానికి చెందిన రైతులు నాగార్జున, చిత్రా నారాయణస్వామి, జయరాములు, తిమ్మయ్య సాగు చేసిన వరి పంట కోత దశలో ఉంది. భారీ వర్షానికి పైరు మొత్తం నేలకొరిగింది. తూంచెర్లలో సుమారు వంద ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

– ఆంధ్రజ్యోతి, కనగానపల్లి

కొత్త జీపు.. పాత జ్ఞాపకాలు


జీపు నడుపుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కొత్త జీపుపై సరదాగా విహరించారు. హైదరాబాద్ నుంచి తెచ్చిన అధునాతన జీపును శనివారం ఆయన సరదాగా నడిపారు. ఇంటి చుట్టూ, మైదానంలో విహరిస్తూ.. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జేసీ ప్రభాకర్ విహారాన్ని ఆయన అనుచరవర్గం ఆనందంగా వీక్షించింది.

దర్జాగా...

- సరిహద్దు దాటుతున్న చౌక బియ్యం
- కర్ణాటకకు తరలుతున్న వందల క్వింటాళ్లు


ఇటీవల కుందుర్పి మండలంలో ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం మీదుగా ప్రతిరోజు వందల క్వింటాళ్ల చౌకధరల ధాన్యపు డిపో బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. ఈ బియ్యానికి కర్ణాటక రాష్ట్రంలో మంచి ధర, డిమాండ్ ఉండటంతో అక్రమ రవాణా ఎక్కువగా సాగుతోంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. అక్రమార్కులు తొలుత ఇక్కడ కిలో రూ. 10లకు బియ్యం సేకరించి నిల్వ చేస్తారు. తర్వాత రాత్రికి రాత్రే ఆ నిల్వలను సరిహద్దులు దాటిస్తున్నారు. కర్ణాటకలో కిలో రూ. 20లు నుంచి రూ.25ల వరకు విక్రయిస్తున్నారు. దీనికితోడు వాటిని అక్కడే పాలిష్ చేయించి కిలో రూ. 30 నుంచి రూ. 40 లు వరకు అమ్ముతున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా లాభసాటిగా ఉండటంతో పలువురు అక్రమార్కులు విచ్చలవిడిగా దీన్ని కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు విజిలెన్స్, పోలీసుల దాడుల్లో పట్టుబడుతున్నా ఈ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

అక్రమ రవాణా సాగుతోందిలా..

ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గం మీదుగా కంబదూరును దాటుకుని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి యథేచ్ఛగా అక్రమ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఎక్కువగా ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాల నుంచే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బొలెరో, ఆటోల్లో ఈ రవాణా సాగుతోంది. తెల్లవారుజాము సమయాల్లోనే ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. కర్ణాటకకు వెళ్లే మార్గంలో కళ్యాణదుర్గం, కంబదూరు పోలీస్‌స్టేషన్లు ఉన్నప్పటికి అక్రమార్కులు భయపడటం లేదు. పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటించేస్తున్నారు. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నా వారిలో ఏ మాత్రం భయం కలగడం లేదు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి కేవలం మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి. దీంతో ఎక్కువగా అక్రమ రవాణా సాగుతోంది. కళ్యాణదుర్గం మండలం మోరేపల్లి, కొత్తూరు అటవీశాఖ దారి వెంబడి వెళ్లి, అక్కడి నుంచి కుందుర్పి మండలం బెస్తరపల్లికి వెళ్లి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. ఈ తతంగం గత కొన్నేళ్ల నుంచి సాగుతున్నా అధికారులు అరికట్టలేకపోతున్నారు.

ప్రత్యేక నిఘా వేశాం



స్టోర్ బియ్యం అక్రమ రవాణాపై మా సిబ్బందితో పూర్తిస్థాయిలో నిఘా వేశాం. కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం టౌన్ పరిధిలో ఉన్న పోలీసులు కూడా వీటిపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దాంతో పాటు కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఉన్న పోలీస్‌స్టేషన్లను కూడా అప్రమత్తం చేశాం.

– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

కూలిన పెన్నా వంతెన

రాకపోకలకు ఇబ్బందులు

హిందూపురం అర్బన్, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): హిందూపురం-పోచనపల్లి మధ్య పెన్నానది వంతెన శనివారం తెల్లవారుజామున కూలిపోయింది. పురాతన వంతెన కావడంతో కాలం చెల్లింది. భారీ వాహనాలు వంతెనపై ప్రయాణించడంతో కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఇసుక ట్రాక్టర్‌లు, టిప్పర్‌లు, బియ్యం వాహనాలు, కంకర టిప్పర్‌లు ఈ వంతెన మీదుగా వెళుతున్నాయి. కర్ణాటకకు అక్రమ రవాణా ఈ మార్గంలోనే సాగుతోంది. 2022లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానది వంతెన కూలిపోయింది. దీంతో అటువైపు ఉన్న దాదాపు పది గ్రామాలకు, కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి అనుకుంటే 25 కి.మీ. చుట్టేసుకుని సేవామందిరం మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.10 లక్షలతో తాత్కాలికంగా ఐరన్ వంతెనను నిర్మించారు. ఇది పాదచారులకు మాత్రమే ఉపయోగపడేది. అంబులెన్స్ వంటివి రాలేకపోయాయి. ఆ తరువాత రూ.80 లక్షలతో 10 మీటర్లు వరకు వంతెనను పునర్నిర్మించారు. ఇంతలోనే పోచనపల్లి వైపు ఉన్న వంతెన కూలిపోయింది. ప్రస్తుతం వంతెనపై ట్రాక్టర్ పట్టేంత మార్గం మాత్రమే ఉంది. అది కూడా ఎప్పుడు కూలుతుందోనని జనం భయపడుతున్నారు. కూలిన వంతెన కింద భాగంలో భారీగా తెర్ర పడింది. భారీ వాహనాలు వస్తే అదికూడా కూలిపోయేలా ఉంది. దీంతో పోచనపల్లి యువకులు ఆ ప్రాంతంలో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. మరోవైపు పెన్నాలో మట్టిరోడ్డును కొందరు ధ్వంసం చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపాము..

పెన్నా నదితో వంతెన కూలింది. వంతెన పునర్నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే టెండర్ పిలుస్తాము. పనులను త్వరగా చేపట్టేందుకు ప్రయత్నిస్తాం. తాజా పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాము.

– మోహన్‌బాబు, ఏఈ ఆర్ అండ్ బీ


ఒక వైపు నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలు


మట్టిరోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

క్షుద్రం.. వజ్రం..!

నిత్యం వివాదాలు.. మోసాలు
వజ్ర భాస్కర్ రెడ్డి తీరుపై విమర్శలు

కదిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు వజ్ర భాస్కర్ రెడ్డి క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడటం జిల్లాలో కలకలం రేపుతోంది. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట అటవీ ప్రాంతంలోని ఓ పురాతన ఆలయంలో క్షుద్రపూజలు చేస్తుండగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న వజ్రభాస్కర్ రెడ్డి పలు పార్టీలను మారారు. నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచడం ఆయనకు అలవాటని స్థానికులు విమర్శిస్తున్నారు. వజ్ర భాస్కర్‌రెడ్డి 2019లో కదిరి వైసీపీ టిక్కెట్ ఆశించారు. దక్కకపోవడంతో మరో పార్టీనుంచి పోటీ చేశారు. ఆ తరువాత బీజేపీలో చేరారు. 2024 ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలో చేరారు. బీజేపీలో ఉండగా మహిళా కార్యకర్తలకు స్థలం ఇస్తానని నమ్మించారు. ఇవ్వకుండా మోసగించారు. దీంతో బాధిత మహిళలు ఆయన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రియల్ వ్యాపారం చేసే వజ్ర భాస్కర్ రెడ్డి.. కొత్త బైపాస్ రోడ్డుకు సమీపంలో ప్లాట్లు వేశారు. తనకు చెందిన రెండు సర్వే నంబర్ల మధ్యలో ఉన్న 33 సెంట్ల ప్రభుత్వ భూమిని కలుపుకున్నారు. ప్రభుత్వ భూమిలో రోడ్లు వేసి, తన భూమిలో ప్లాట్లు వేసుకున్నారు. ప్రభుత్వ భూమి విలువ ఒకటిన్నర కోటి ఉంటుంది.

అందరూ అంతేనా..!

రియల్ మోసాలు, ప్రభుత్వ భూముల కబ్జా, ప్రజలను మోసం చేయడం వంటి అనేక కేసుల్లో కదిరికి చెందిన పలువురు వైసీపీ నాయకులు నిందితులుగా ఉన్నారు. తలుపుల ఉప సర్పంచ్ డి. క్రిష్ణారెడ్డి, అలియాస్ డిక్కీ బాబు ఓ టీచర్‌ను మోసగించి జైలుపాలయ్యారు. వివిధ ప్రాంతాల్లో రైస్ పుల్లింగ్ పేరిట మోసాలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఇదే మండలానికి చెందిన వజ్రభాస్కర్ రెడ్డి క్షుద్ర పూజలు చేస్తూ పట్టుబడ్డారు.


వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో వజ్ర భాస్కర్‌రెడ్డి (ఫైల్)

బ్రేక్..!

ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలు తాత్కాలికంగా నిలిపివేత

- ఆర్థిక శాఖ అనుమతులు లేకపోవడమే కారణం
- వైసీపీ సర్కార్‌లో టెండర్లు ఖరారు
- పారదర్శకతపై సర్వత్రా అనుమానాలు..


శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్ నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతలో ప్రైవేటు ఏజెన్సీలో వాహనాల ఫిట్‌నెట్ పరీక్షలకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆర్థిక శాఖ అనుమతులు లేకపోవడంతోనే నిలుపుదల చేసినట్లు సమాచారం. వైసీపీ సర్కార్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణ కోసం టెండర్లు ఖరారు చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికల సమయంలో టెండర్లు దక్కించుకున్న సంస్థలకు బాధ్యతలు అప్పగించలేదు. ఎన్నికల తర్వాత ఈ ఏడాది సెప్టెంబరు ఆరంభం నుంచి జిల్లాలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్ఎంఎస్) నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జాతీయరహదారిలోని హైదరాబాద్ చెక్స్ ఎదురుగా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పరిధిలో అయ్యవారిపల్లికి వెళ్లే దారిలో ఫిట్ నెస్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రైవేటు కేంద్రంలోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు.

పారదర్శకతపై అనుమానాలు

వైసీపీ హయాంలో వాహనాల ఫిట్‌నెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు ఖరారు చేశారు. అయితే ఇది పారదర్శకంగా జరిగిందో లేదోనన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల వరకు నిర్వహణ కోసం టెండర్లు ఖరారు చేసినట్లు సమాచారం. అయితే కూటమి ప్రభుత్వం ఈ విధానంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా అనంత జిల్లాతోపాటు మరో రెండు జిల్లాల్లో మాత్రమే ఇప్పటి దాకా ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగిలిన జిల్లాల్లో ఇంకా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఓపెన్‌లోని కేంద్రాల్లో ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణపైనా ప్రభుత్వం దృష్టి సారించాలన్న యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆర్థిక శాఖ అనుమతులు లేవన్న కారణంతోనే ప్రైవేటు సంస్థల్లో నిర్వహిస్తున్న వాహనాల ఫిట్‌నెస్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిసింది.

అప్పటి దాకా ఆర్టీఏ ఆఫీస్‌ల్లోనే పరీక్షలు

జిల్లా కేంద్రం సమీపంలోని ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలను తాత్కాలికంగా నిలుపుదల చేసిన నేపథ్యంలో పాత పద్ధతిలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిల్లోని అన్ని రకాల వాహనాలకు ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీకి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత అప్పగించినప్పటి నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాల వాహనాలు తప్పని సరిగా జిల్లా కేంద్రం సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వచ్చేవి. గత వారం రోజులుగా అక్కడ ఫిట్‌నెస్ పరీక్షలు బంద్ చేయడంతో తిరిగి ఆర్టీఏ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి నిర్ణయం వచ్చే దాకా ఆర్టీఏ కార్యాలయాల్లోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగుతాయి.


అనంత ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షల కోసం నిలిపిన వాహనాలు

తాత్కాలికంగా బంద్: వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

పలు కారణాల నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహణను ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే దాకా ఆర్టీఏ కార్యాలయాల్లోనే యథాతథంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం. అప్పటి దాకా ప్రైవేటు ఏజెన్సీకి బదులుగా పాత పద్ధతిలో వాహన్ సైట్‌లో ఫిట్‌నెస్ పరీక్షల కోసం చలానాలు కట్టాలి. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలి.

న్యూస్ బాక్స్

సత్యసాయి జయంతికి వంద బస్సులు

ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్

పుట్టపర్తి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని పుట్టపర్తి నుంచి వివిధ ప్రాంతాలకు వంద ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం(రీజినల్ మేనేజర్) మధుసూదన్ తెలిపారు. ఈనెల 22నుంచి 25 వరకు ఈబస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలోకి 22నుంచి 24వరకు మూడురోజులపాటూ రోజుకు పది సర్వీసులు నిరంతరం తిరుగుతాయన్నారు. అలాగే 22, 23 తేదీల్లో హిందూపురం వయా పెనుకొండ మీదుగా ఐదు బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు. హిందూపురం వయా గోరంట్ల మీదుగా 22 నుంచి 24 వరకు మూడు రోజులపాటు పది సర్వీసులు తిరుగుతాయన్నారు. 23, 24 తేదీల్లో కదిరి వయా నల్లమాడ మీదుగా పుట్టపర్తికి ప్రతిరోజు ఐదు బస్సులు తిరుగుతాయన్నారు. 22నుంచి 24 వరకు ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తికి 12 బస్సులు తిరుగుతాయన్నారు. అనంతపురం నుంచి పుట్టపర్తికి 22 నుంచి 24వరకు మూడు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. చెన్నై నుంచి కూడా పుట్టపర్తికి బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరు, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌లనుంచి పుట్టపర్తికి 22నుంచి 24వరు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. భక్తుల రద్దీని బట్టి మరిన్నిసర్వీసులు నడుపుతామన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి నిర్మలజ్యోతి

పుట్టపర్తిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి నిర్మలజ్యోతి శనివారం ఓ‌ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 24లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి కార్యాలయం (శ్రీసత్యసాయిజిల్లా)లో అందచేయాలని పేర్కొన్నారు. బీసీల్లో 66శాతం, ఎస్సీల్లో 20శాతం, ఎస్టీల్లో 14శాతం మందిని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారికి గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లాకేంద్రంలోని దీనజనోద్ధరణ భవన సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం (శ్రీసత్యసాయిజిల్లా)లో దరఖాస్తులందచేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు నేరుగా కార్యాలయంలో కాని ఫోన్ నెంబరు 9393141545లోగానీ సంప్రదించాలని తెలిపారు.

నారా రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడి మృతిపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంక టేశ్వరప్రసాద్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఇర్ఫాన్ సేఫ్

కొయ్యను బయటకు తీసిన వైద్యులు



బాలుడి శరీరం నుంచి బయటకు తీసిన కొయ్య

కణేకల్లు, నవంబరు 16(ఆంధ్ర జ్యోతి): రేగు చెట్టు నుంచి పడి.. నడుములోకి కొయ్య దూసుకెళ్లిన బాలుడు ఇర్ఫాన్.. సురక్షితంగా బయటపడ్డాడు. బాలుడి శరీరం నుంచి కొయ్యను కర్నూలు వైద్యులు విజయవంతంగా బయటకు తీశారు. కణేకల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద రేగు చెట్టు మీద నుంచి ఇర్ఫాన్ శుక్రవారం కింద పడిన విషయం తెలిసిందే. బాలుడి నడుము భాగంలోకి కొయ్య దూసుకెళ్లడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. కర్నూలు వైద్యులు శస్త్ర చికిత్స చేసి ఇర్ఫాన్ నడుములో ఇరుక్కున్న కొయ్యను బయటకు తీశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి బాగుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కావ్యకంఠ గణపతి ముని (జయంతి)



కావ్యకంఠ గణపతి మునిగా పేరొందిన అయ్యల సోమయాజులు గణపతి శాస్త్రి 1878 నవంబరు 17న బొబ్బిలి ప్రాంతం కలవరాయి అగ్రహారలో జన్మించారు. రమణ మహర్షి శిష్యులలో ప్రముఖుడైన ఆయన పండితుడు, జ్యోతిష్యుడు, ఆధ్యాత్మిక వేత్తగాను రాణించారు. తెలుగు పండితుడిగా, అధ్యాపకులుగా పనిచేశారు. పదో యేటనే తెలుగు, సంస్కృత భాషలందు, వేదములు, తర్కం, గణితం, జ్యోతిష్యం, ఆయుర్వేదములో అసమాన ప్రతిభ చూపారు. వివిధ ప్రదేశాలలో తపస్సు ఆచరించి మంత్ర సిద్ధి పొందారు. పలు దేవుడి స్తోత్రాలను రచించారు. 1936 జూలై 25న నిర్యాణము చెందారు.

జెమినీ గణేశన్ (జయంతి)



తమిళ సినీరంగంలో వెండితెరపై జెమినీ గణేశన్‌గా పేరొందిన రామస్వామి గణేశన్ 1920 నవంబరు 17న తమిళనాడులోని పుదుక్కొట్టై ప్రాంతంలో జన్మించారు. రొమాంటిక్ పాత్రలతో 'కాదల్ మన్నన్'గా అభిమానులచే పిలువబడ్డారు. తెలుగు, హిందీ భాషల సినిమాలలోనూ నటించారు. పద్మశ్రీ, కలైమామణి తదితర పురస్కారాలు పొందారు. మహానటి సావిత్రిని పెళ్ళాడారు. ఆయన 2005 మార్చి 22న తుదిశ్వాస వీడడంతో ప్రభుత్వలాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.

లాలా లజపత్‌రాయ్ (వర్ధంతి)



'పంజాబ్ కేసరి'గా పేరొందిన లాలా లజపత్‌రాయ్ 1865 జనవరి 28న పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్‌పురిలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు. లాల్, బాల్ (బాల గంగాధర తిలక్), పాల్ (బిపిన్ చంద్రపాల్) త్రయంలో ఆయన ప్రథములు. సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించి 'సైమన్ గో బ్యాక్' నినాదం చేశారు. పత్రికలను ప్రోత్సహించడం ద్వారా ప్రజా చైతన్యం తెచ్చారు. కాంగ్రెస్ పార్టీలోనూ కీలకంగా వ్యవహరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, లక్ష్మీ ఇన్సూరెన్స్ సంస్థల సంస్థాపకుడు. పోలీసు దాడులలో గాయపడి చివరకు 1928 నవంబరు 17న కన్నుమూశారు.

బాల్ ఠాక్రే (వర్ధంతి)



శివసేన పార్టీ వ్యవస్థాపకుడైన బాల్ ఠాక్రే (థాకరే) 1926 జనవరి 23న పూనేలో జన్మించారు. మరాఠీల ఆరాధ్యదైవం. రాజకీయ వ్యంగ్య చిత్రకారుడిగా జీవనం ఆరంభించి క్రమేపీ రాజకీయాల్లోకి వచ్చారు. హిందూత్వను, హిందూ జాతీయవాదాన్ని బలపర్చాడు. దశాబ్దాలపాటు మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ రాజకీయాలను సైతం ప్రభావితం చేసిన విలక్షణ వ్యక్తి. శివసేన అధికారంలోకి వచ్చినా ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2012 నవంబరు 17న కన్నుమూశారు. ఎలాంటి అధికార పదవిని చేపట్టని ఠాక్రేకు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా 20లక్షల మందికిపైగా అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

డాక్టర్ వరప్రసాద రెడ్డి (పుట్టినరోజు)



కోడూరు ఈశ్వర వరప్రసాద రెడ్డి 1948 నవంబరు 17న నెల్లూరులో జన్మించారు. టీకాలు ఉత్పత్తి చేసే శాంత బయోటెక్నిక్స్ సంస్థాపకుడు. పారిశ్రామికవేత్త, శాస్త్రవేత్త. స్వదేశీ హెపటైటిస్ బి టీకాను ఉత్పత్తిచేసిన సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారు. 2005లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. గౌరవ డాక్టరేట్‌లు పొందారు. సాహిత్యం, కళలు, సంగీతంపై రచనలు చేశారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి, ముళ్ళపూడి వెంకటరమణల ఆటోబయోగ్రఫీ రాశారు. యోగాను విస్తృతం చేయడానికి కృషి చేశారు.

ఘటం ఉడుప (పుట్టినరోజు)



ఘటం గిరిధర్ ఉడుప 1980 నవంబరు 17న జన్మించారు. ఘటం వాద్యకారులలో నిష్ణాతులు. లయ తరంగ సభ్యుడు. శాస్త్రీయ, జానపద సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. ఉడుప ఫౌండేషన్ ద్వారా సంగీతం, కళలను ప్రోత్సహిస్తున్నారు. కర్ణాటక సంగీతాన్ని ఘటంతోపాటు మృదంగం, ఖంజీర, మోర్చింగ్‌లతో ప్రదర్శించి సత్తా చాటుకున్నారు. కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాన్, గాన కళా పరిషత్, నాదజ్యోతి పురస్కారంతోపాటు పలు గౌరవాలు అందుకున్నారు.

మహిళపట్ల అనుచిత ప్రవర్తన

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొడుకు ప్రేమ వివాహానికి తల్లిని బట్టలూడదీసి ఊరేగించిన సంఘటన మరువకముందే బెళగావిలో అటువంటి సంఘటన శనివారం తెరపైకి వచ్చింది. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తుకు సిద్ధమయ్యారు. మాళ మారుతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న తల్లీ కూతురు పట్ల నిత్యం దూషించే పొరుగింటివారు దాడి చేసినట్టు ఫిర్యాదు చేశారు. బాధిత మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం మహారాష్ట్ర యువకుడితో పెళ్లి జరిగిందని ఇద్దరు పిల్లల తర్వాత భర్త కుటుంబీకుల వేధింపులు తట్టుకోలేక తల్లిదగ్గరే ఉంటున్నట్టు తెలిపారు. ఇటీవల కొంతకాలంగా ఇంటిపక్కన ఉండే ఇందిరా అష్టేకర్, హూవప్ప అష్టేకర్, మణికంఠ అష్టేకర్‌లు రోజూ తిడుతుంటారన్నారు. మా ఇంటికి ఎవరు వచ్చినా వేశ్యావాటిక అంటూ హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల సోమవారం మా తల్లిపై దాడి చేశారని, చీర లాగి కొట్టారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారు స్పందించలేదన్నారు. ఇంటికి వాపసు వస్తే దాడి చేసినవారు ఫిర్యాదు వాపసు తీసుకోకుంటే మేం ప్రతి ఫిర్యాదు చేస్తామని, మాకు పలుకుబడి ఉందంటూ బెదిరిస్తున్నారన్నారు. మేం ఎలాంటివారమనేది ఎవరినైనా విచారించుకోవచ్చునన్నారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే ఆసిఫ్‌సేఠ్, నగర పోలీస్ కమిషనర్ యడామార్టిన్ మార్బ్యాన్యాంగ్, డీసీపీ రోషన్ జగదీశ్‌లు బాధితులను పరామర్శించారు. నగర పోలీస్ కమిషనర్ తెలిపిన మేరకు బాధితుల ఫిర్యాదును ఎందుకు స్వీకరించలేదో పరిశీలిస్తామని మరోవైపు ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

టెక్ సమ్మిట్‌కు సర్వం సిద్ధం

» అన్‌బౌండ్ థీమ్‌తో ఏర్పాట్లు - ప్యాలెస్ గ్రౌండ్స్‌లో 19 నుంచి

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): 'బెంగళూరు టెక్ సమ్మిట్'కు సర్వం సిద్ధం చేశామని ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ ఐటీబీటీ శాఖ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా బెంగళూరు సహకారంతో ఈనెల 19నుంచి 21వరకు టెక్ సమ్మిట్ జరగనుందన్నారు. శనివారం ప్యాలెస్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అన్‌బౌండ్ అనే థీమ్‌తో బీటీఎస్ సదస్సు జరుగుతుందన్నారు. స్టార్టప్‌ల సర్వతోముఖాభివృద్ధిని లక్ష్యం చేసుకుని అంతర్జాతీయస్థాయిలో భాగస్వాములకు ప్రాధాన్యత ఇవ్వదలిచామన్నారు. టెక్నాలజీ, సాంకేతికత, ఆధునికత సాంకేతిక రంగంలో కర్ణాటక ముందంజలో ఉందన్నారు. ఇక దేశంలోనే బెంగళూరు స్టార్టప్ కేంద్రంగా రాణిస్తోందన్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు టెక్ సమ్మిట్‌ను ప్రారంభిస్తారన్నారు. జర్మనీ ఆర్థిక వ్యవహారాలశాఖ మంత్రిత్వ స్టార్టప్ కమిషనర్ డాక్టర్ అన్నా క్రిస్మన్, ఫ్రాన్స్ ప్రతినిధి అలెగ్జాండర్ డబ్లాంచె, టెక్సాస్ ఇన్వెస్ట్‌మెంట్ ఇండియా ఎండీ సంతోష్‌కుమార్, స్విగ్గీ సంస్థ సీఈఓ శ్రీహర్ష మేజేటి, బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్‌షా పాల్గొంటారన్నారు. సమ్మిట్‌కు 15దేశాలనుంచి ప్రతినిధులు విచ్చేస్తున్నారన్నారు.



టెక్ సమ్మిట్ జరిగే ప్యాలెస్ గ్రౌండ్స్‌లోని ప్రదేశం ఇదే

రాజ్యాంగం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది

» మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమోహన్‌దాస్

» వ్యాసరచన పోటీ.. పాల్గొన్న 175 కళాశాలలు - 390మంది విద్యార్థులు

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని పెంపొందింపచేస్తుందని అందుకే విద్యార్థులు చదవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్ఎన్ నాగమోహన్‌దాస్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు ఆర్ట్స్ కళాశాల, సంవిధాన అభియాన కర్ణాటకలు సంయుక్తంగా రాష్ట్ర స్థాయిలో రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుంచి 175 కళాశాలల ద్వారా 390మంది విద్యార్థులు భాగస్వామ్యులయ్యారు. పోటీలను మాజీ న్యాయమూర్తి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ 1949 నవంబరు 26న భారతరాజ్యాంగాన్ని మనకు మనమే అంకితం చేసుకున్నామన్నారు. ఇదే రోజున రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుతామన్నారు. విద్యార్థి దశలో రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలన్నారు. రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమానమైన హక్కులను కల్పిస్తుందన్నారు. దేశపౌరులంతా సమానత్వంగా జీవించేలా రాజ్యాంగంలో హక్కులను పొందుపరిచారన్నారు. ఈ విషయాలను విద్యావంతులు కూడా తెలుసుకోకపోవడం సముచితం కాదన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే తత్వం పెంచుకోవాలన్నారు. రాజ్యాంగం గురించి తెలుసుకుంటే ఉత్తమ విద్యార్థులు అవుతారన్నారు. విద్యార్థులకు రాజ్యాంగం గురించి కనీస అవగాహన ఉండాలని, రాష్ట్రస్థాయిలో పోటీలు జరిపామన్నారు. వందో, రెండువందలమంది రావచ్చునని భావించామని అంతకు రెట్టింపు భాగస్వామ్యం కావడం సంతోషమన్నారు. విజేతలకు రాజ్యాంగ దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పిటీ శ్రీనివాసనాయక, కన్నడసంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి, సంవిధాన అభియాన సంచాలకులు రాజశేఖరమూర్తి, మాజీ ఐఆర్ఎస్ బీమాశంకర్, సాంస్కృతిక కళా సమితి సంచాలకులు డాక్టర్ శశికళలు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాజీ జస్టిస్ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ నాగమోహన్‌దాస్ తదితరులు

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్‌ను యలహంకకు చెందిన టీడీపీ అభిమానులు, చేనేత కార్మికులు సన్మానం చేశారు. జయనగర్‌లోని నివాసంలో నరేశ్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత నాయకులు పాపణ్ణ, పురుషోత్తమ్, మంజు, కేశవనాయుడు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నరేశ్‌కుమార్ మాట్లాడుతూ టీటీడీ బోర్డు సభ్యుడు కావడం సంతోషంగా ఉందని, తిరుమలలో ఆధ్యాత్మికతను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.



సన్మానం అందుకున్న నరేశ్ కుమార్

కృషి మేళాను సందర్శించిన 10లక్షలమంది

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కృషి మేళాను మూడోరోజు పదిలక్షలమంది సందర్శించారు. హాసన్, మండ్య, తుమకూరు జిల్లాల ఆదర్శరైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ పీజీ చెంగప్ప ముఖ్యులుగా పాల్గొని సత్కరించారు. జలవనరులశాఖ కమిషనర్ మహేశ్ బి శిరూర్, ఉద్యాన పరిశోధనా కేంద్రం డైరెక్టర్ తుషార్ శాంతి బెహరా, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సురేశ్ పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో వీసీ సురేశ్ తదితరులు

విద్యార్థులకు సంస్కారం నేర్పాలి

» ప్రతిభా పోటీలలో నగరసభ అధ్యక్షుడు జగన్నాథ

చింతామణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం నేర్పించే బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందని నగరసభ అధ్యక్షుడు జగన్నాథ అభిప్రాయపడ్డారు. చింతామణి పట్టణంలోని అంజని లే అవుట్‌లోగల రాయల్ పాఠశాలలో విద్యాశాఖ, తాలూకా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థుల తాలూకాస్థాయి ప్రతిభా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్లో దాగియున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కాగా గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చింతా మణి శాఖ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్య క్రమానికి బీఈఓ ఉమాదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పిల్లలు మొబైల్‌లకు వ్యసనం కారాదన్నారు. మంచి చెడుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రవణప్ప మహాభారతంలోని దుర్యోధనుడి డైలాగ్‌లను చెప్పి పిల్లలను ఆకట్టుకున్నారు. కిశోర్ స్కూల్‌కు ఎందిన బాలరామ, సంతె కల్లహళ్ళి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన వినుశ్రీ వెంకటరమణస్వామి వేషధారణ, కైవార కేపీఎస్ స్కూల్ విద్యార్థుల జానపద నృత్యం, ఆదర్శపాఠశాల విద్యార్థుల లంబాణి నృత్యం ఆకట్టుకుంది. విజేత విద్యార్థులకు రాయల్ పాఠశాల కార్యదర్శి ప్రేమలతా ప్రశంసాపత్రం అందచేశారు.



వెంకటరమణస్వామి వేషధారణతో ప్రథమ బహుమతి గెలుపొందిన తనుశ్రీకి అభినందనలు

తెలుగు టీచర్లకు ఘన సత్కారం

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ప్రభుత్వ తెలుగు పాఠశాలల్లో సుదీర్ఘంగా సేవలందించి పదోన్నతులు పొందిన ఇద్దరు ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. సైన్స్ టీచర్ ముత్తు మాధవి హెచ్ఎంగా పదోన్నతి పొందడం, హనుమేగౌడ ఎఫ్‌డిఏ నుంచి ఎస్‌డిఏగా పదోన్నతి పొందినమేరకు శనివారం సత్కరించారు. శివాజినగర్ పాఠశాలలో జాగర్లమూడి లోకనాథబాబునాయుడు, తోట గణేశ్‌నాయుడు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు పాఠశాలల నుంచి పదోన్నతులు, పదవీ విరమణలు పొందిన తర్వాత ఖాళీ అయ్యే స్థానాలకు కొత్తగా ఉపాధ్యాయులను నియమించకపోవడం విద్యార్థులకు సమస్యగా మారుతోందన్నారు. వీరిద్దరికి పదోన్నతి వచ్చేందనే సంతోషం ఉందన్నారు. వారి అంకితభావమైన సేవలకు ఎంతో మంది విద్యార్థులకు అనుకూలమైందన్నారు. హెచ్ఎం డాక్టర్ వీరభద్రప్ప, ఉపాధ్యాయులు శ్యామలా కుమారి, మహబూబి, జమున, కేశవ, శ్రీనివాసులు, లత, చిరంజీవి, ఆనందేశ్వరరావు, రామమోహనరెడ్డి, పూర్వ విద్యార్థులతోపాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు మైసూరు తలపాగాతో సన్మానం

దేశాభివృద్ధి దిశగా అడుగులు



సదస్సులో పరమవీర చక్ర గ్రహీత కెప్టెన్ యోగేంద్రసింగ్ యాదవ్

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి దిశగా యువతను ప్రోత్సహించేలా సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. నగరంలోని హెచ్ఏఎల్ మేనేజిమెంట్ అకాడమీలో ప్రాజెక్టు మేనేజిమెంట్ ప్రాక్టీషనర్స్ కాన్ఫరెన్స్ (పిఎంపిసి) 2024 సమ్మేళనం శనివారం జరిగింది. పరమవీర చక్ర పురస్కార గ్రహీత కేప్టెన్ యోగేంద్రసింగ్ యాదవ్ జ్యోతిప్రజ్వళనతో ప్రారంభించారు. అకాడమీ ఈడీ అండ్ డీన్ డాక్టర్ శ్రీకాంత్ శర్మ, అధ్యక్షుడు నికుంజ్ పరశర్, సాగర్ డిఫెన్స్‌కు చెందిన అమిత్ గోయల్, ప్రాంతీయ మేనేజింగ్ డైరెక్టర్, పిఎంఎఐ ఎస్ఏ, పలాశ్ గుప్త, శాలిని తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. యోగేంద్రసింగ్ యాదవ్ మాట్లాడుతూ దేశ యువకుల సామర్థ్యం గురించి, తమ ఆలోచనలను పంచుకున్నారు. దేశ రక్షణా శౌర్యులగాథలను ప్రస్తావిస్తూ సభికులలో ప్రేరేపించారు. ప్రాజెక్ట్ మేనేజర్‌లు దీని ద్వారా పాఠం నేర్చుకోవాలన్నారు. ప్రతీక్ ఖండేల్వాల్ మాట్లాడుతూ ప్రమాదాల కారణంగా వీల్‌చెయిర్‌కు పరిమితమైన వారు సైతం వివిధ రంగాలలో ప్రతిభ చాటుతున్నారన్నారు. వారి ప్రతిభను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్పేస్ కిడ్స్ ఇండియా సీఈఓ కెసన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలు, సాధనల గురించి వివరించడం ద్వారా పిల్లల్లో ఆసక్తి కల్పించాలన్నారు. సదస్సులో పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

రూ.65 కోట్ల బీడీఏ ఆస్తి స్వాధీనం

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బెంగళూరు అభివృద్ధి ప్రాధికార (బీడీఏ) ఆధ్వర్యంలో నగరంలోని అనధికార నిర్మాణాల తొలగింపు కార్యాచరణ కొనసాగింది. శనివారం జేపీనగర్ 8వ ఫేజ్ రెండోబ్లాక్‌లో రూ.65కోట్ల ఆస్తిని స్వాధీనం చేసుకుంది. బెంగళూరు దక్షిణ తాలూకా ఉత్తరహళ్ళి హోబళి కొత్తనూరు గ్రామ సర్వే 38/1లోని ఒక ఎకరాలో అనధికార నిర్మాణాలను పొక్లైనర్‌ల సాయంతో తొలగించారు. బీడీఏ అధికారి, దక్షిణ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సహాయ కార్యవర్గ ఇంజనీర్, పోలీసుల సహకారంతో కార్యాచరణ కొనసాగింది.

మార్కెట్‌కు మరింత తగ్గిన టమోటాలు

అనంతపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు వారంరోజులుగా టమోటా ఉత్పత్తులు రావడం తగ్గుతూ వస్తోంది. శనివారం భారీగా తగ్గాయి. 450 టన్నులు మాత్రమే వచ్చాయి. అయితే ధరల్లో మాత్రం ఎలాంటి వ్యత్యాసం కనిపించడం లేదు. కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడుపోగా, సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

సామర్థ్యలో పీఈఎస్ విద్యార్థుల సత్తా



ట్రోఫీలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జయనగర్‌లోని సురానా కళాశాల నిర్వహించిన అంతర కళాశాలల మధ్య క్రీడ, సాంస్కృతిక, క్విజ్, చర్చాగోష్ఠుల 'సామర్థ్య'లో పీఈఎస్ విద్యార్థులు రాణించారు. 19 విభాగాలలో పోటీలు జరగ్గా 17 విభాగాలలో పీఈఎస్ పీయూ విద్యార్థులు ప్రతిభను చాటారు. శనివారం హనుమంతనగర్ క్యాంపస్‌లు బహుమతులు పొందిన విద్యార్థులను యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి అభినందించారు. విద్యార్థులను ఏఏ విభాగాల్లో పాల్గొన్నారు, అంశాలపై అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలు, క్విజ్‌లలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపాలని సూచించారు. విద్యార్థులు మరిన్ని క్రీడాపోటీల్లో సత్తా చాటాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్యాన్ని కాపాడే బాధ్యత మీడియాదే

» మాజీ సీఎం వీరప్పమొయిలీ

సమాజంలో మీడియాను నాశనం చేయడం అసాధ్యమని రాజ్యాంగబద్ధంగా లభించిన స్వాతంత్ర్యాన్ని కాపాడే బాధ్యత మీడియాదేనని మాజీ సీఎం వీరప్పమొయిలీ అభిప్రాయపడ్డారు. కర్ణాటక మీడియా అకాడమీ, సమాచారశాఖ సంయుక్తంగా శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరిపారు. మారుతున్న మీడియా స్వరూపం అనే అంశంపై చర్చాగోష్ఠిలో వీరప్పమొయిలీ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వ విజయానికి కార్యాంగ, శాసకాంగ, న్యాయంగతోపాటు మీడియా కూడా అవసరమన్నారు. అసహాయతను తిప్పికొట్టేందుకు పత్రికలు అవసరమన్నారు. అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ డాక్టర్ ఏ నారాయణ, సమాచార శాఖ కమిషనర్ హేమంత్ నింబాల్కర్, మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషా ఖానం, మీడియా అకాడమీ కార్యదర్శి సహనలు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న మాజీ సీఎం వీరప్పమొయిలీ

బూదగూరులో పింఛను అదాలత్

శిడ్లఘట్ట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, ప్రయోజనాలు పొందేందుకు రైతులు, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా రెవెన్యూ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఉప తహసీల్దారు పూర్ణిమా తెలిపారు. తాలూకాలోని ఆనూరు పరిధిలోని బూదగూరు గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పింఛను అదాలత్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. నెలకోసారి అదాలత్ ఉండేదని మధ్యలో అంతరాయం నెలకొనగా తిరిగి పున రుద్ధరించబడిందని నాదకచేరిలో అదాలత్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించనున్నట్టు తెలిపారు. అదాలత్‌లో వేణు గోపాల్, పంచాయతీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న ఉప తహసీల్దారు పూర్ణిమా

ఆనేకల్‌లో కన్నడ రాజ్యోత్సవం



వివిధ రంగాల సాధకులకు సన్మానం

దొమ్మసంద్ర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్‌లో తాలూకా యంత్రాంగం, జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఏఎస్‌బి కళాశాల మైదానంలో ఏర్పాటైన కార్యక్రమానికి ఎమ్మెల్యే బి శివణ్ణ, తహసీల్దారు శశిధర, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి కే మంజునాథ్, పురసభ అధ్యక్షులు సుధా నిరంజన్, కన్నడ పోరాటనేత సింగేన అగ్రహార, ఎస్‌కే హరీశ్‌లు పాల్గొన్నారు. మండ్య టైమ్స్ పత్రిక సంపాదకులు కన్నడ రాజ్యోత్సవ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరిం చారు. కార్యక్రమంలో హెబ్బ గూడి నగరసభ అధ్యక్షులు ప్రమీళా పి రామచంద్ర, కన్నడ, దళిత సంఘాల ప్రముఖులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.08	1,601.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,269	1,829
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,007	8,450
నీటి నిల్వ (టీఎంసీలు)	98.18	24.06

మద్దతు ధరతో పంటల కొనుగోలు

● తొలిసారి వరి ధాన్యానికీ అవకాశం ● జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాలు: కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతుల పంటలు మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రత్యేక కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటించారు. నగరంలోని అనంతపురం రోడ్డు జిల్లా పాలనా భవనంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సీజన్‌లో కనీస మద్దతు పథకం కింద రైతుల నుంచి వరి, మినుము, మొక్కజొన్నలను కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ఏడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. 2024-25 వర్షాకాలంలో పండించిన తెల్ల మొక్కజొన్నను రైతుల నుంచి నేరుగా కనీస మద్దతు ధర పథకం కింద కొనుగోలు చేయాలని జిల్లాటాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ణయించిందన్నారు. గతంలో మినుము, మొక్కజొన్న పంటలను మాత్రమే మద్దతు ధర పథకం కింద నమోదు చేసి కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం జిల్లాలో వరి సాగును ప్రోత్సహించేందుకు వరిని కూడా నమోదు చేసి కొనుగోలు చేస్తున్నామన్నారు.

జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలివే..

కనీస మద్దత ధర పథకం కింద రైతుల నుంచి వరి, మినుము,మొక్కజొన్న తదితర వ్యవసాయ ఉత్పత్తులను బళ్లారి తాలూకాలోని వ్యవసాయ ఉత్పత్తి సహకార మార్కెటింగ్ సొసైటీ(ఏపీఎంసీ యార్డ్) కురుగోడు తాలూకాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ఏపీఏసీయార్డ్) ప్రాథమిక వ్యవసాయ అధికారులు స్వీకరిస్తారు. కంప్లి తాలూకాలోని కోఆపరేటివ్ సొసైటీ , సండూర్‌తాలూకాలోని ప్రాథమిక వ్యవసాయ యార్డ్ , సిరుగుప్ప తాలూకా వ్యవసాయోత్పత్తుల సహకార విక్రయ సంఘం (ఏపీఎసీ యార్డు) హచ్చుల్లి ఏపీఎంసీ యార్డు, కరూర్ ఏపీఎంసీ యార్డులో నేరుగా రైతుల నుంచి పంటలను కొనుగోలు చేస్తారు. గతంలో ఐదు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేశామని, ఈ సారి అదనంగా రెండు కేంద్రాలను ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. సాధారణ వరికి క్వింటాల్ రూ. 2300, తెల్లజొన్న రూ.3,421 నిర్ణయించినట్లు కలెక్టర్ ప్రకటించారు. రైతులు తమపంటలను కనీస మద్దతు ధర పథకం కింద విక్రయించేందుకు ముందుకు రావాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి

సమస్యలు తలెత్తకుండా చూడాలి: ఎస్పీ

జిల్లాపోలీసు సూపరింటెండెంట్ శోభారాణి మాట్లాడుతూ గతంలో పంట నమోదు, కొనుగోలు సమయానికి సంబంధించిన సమస్యలను పరిశీలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా కొనుగోళ్లను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఆహార పౌరసరఫరాల వినియోగదారుల వ్యవహారాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సకీనా, వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు సోమసుందర్, బళ్లారి తాలూకా తహసిల్దార్ గురురాజ్, జిల్లాస్థాయి అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

● కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్

కంప్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పనులే సండూరు ఉప ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయని కుడితిని పట్టణ కాంగ్రెస్ నాయకులు వి రాజశేఖర్, జెట్టి ధీమా వ్యక్తం చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ నాయకుడు తుకారామ్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సండూరులో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. తాను పట్టణ పంచాయతీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సుమారు రూ. 30 కోట్లు బీఎంఎఫ్ నిధులతో పూర్తిగా రోడ్డు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు తదితర అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కాంగ్రెస్ గెలుపుతో నియోజకవర్గంలో మళ్లీ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. వారితో పాటు సురేష్, గంగాధర, మంజు, రమేష్, భీమేష్, మాంతేష్, భీమా, జాకీర్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరమ్మకు ప్రత్యేక పూజలు

కంప్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో శనివారం గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు చక్కెర హారతులతో ఆలయాలకు చేరుకుని గౌరీదేవిని ప్రతిష్ఠించి అమ్మవారికి పూజలు జరిపారు. గౌరీ పూజలతో కుటుంబంలో ఆరోగ్యం, సుఖ శాంతులతో జీవనం కొనసాగిస్తామనేది అందరి నమ్మకం.



అలంకరణలో గౌరమ్మ

యువశక్తిని ప్రోత్సహించడమే లక్ష్యం: మంత్రి

రాయచూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యువతీ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను, సామర్థ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం యువజనోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చిన్ననీటి పారుదల, విజ్ఞాన తంత్రజ్ఞాన శాఖల మంత్రి ఎన్.ఎస్ బోసరాజు పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ వీవీ ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, నేటి తరం యువకుల్లో అపారమైన శక్తి సామర్థ్యాలు ఉన్నా వాటిని వెలికి తీసేందుకు సరైన వేదికలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ క్రమంలోనే యువజనోత్సవాల పేరుతో ప్రభుత్వం యువశక్తిని మరింత పెంపొందించేందుకు తగిన కార్యచరణ చేపట్టినట్లు తెలిపారు. నేటి సమాజంలో విజ్ఞాన శాస్త్రానికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అత్యంత అవశ్యకత ఉన్న నేపథ్యంలో తమ శాఖ ఆధ్వర్యంలో దీని పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విజ్ఞాన తంత్రజ్ఞానానికి సంబంధించి మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విజ్ఞాన పురోగతి పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఇప్పటికే తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల స్థాయి విద్యార్థులకు టెలిస్కోపులను అందజేసినట్లు మంత్రి వివరించారు.

ఆడిటోరియం పనులు సత్వరం పూర్తి చేయాలి

నగరం నడ్డిబొడ్డిలో నిర్మిస్తున్న మహిళ సమాజం ఓపన్ ఆడిటోరియం పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. ఆడిటోరియం పనులు శనివారం పరిశీలించిన మంత్రి, నగరం నడిబొడ్డున ఉన్న ఆడిటోరియం నిర్మిస్తుండం హర్షణీయమని, పలు కార్యక్రమాలను అత్యంత అనువుగా ఉంటుందన్నారు. ఆడిటోరియం పనులు వెంటనే పూర్తి చేయడం ద్వారా ప్రజలకు తగిన సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధాన గేటు మినహా ఎక్కడి నుంచైనా ఇతరులు ప్రవేశానికి వీలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఓపెన్ ఆడిటోరియం పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోటుపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



ఆడిటోరియం పనులు పరిశీలిస్తున్న మంత్రి ఎన్ఎస్ బోసరాజు



ఏడీసీ జుబేర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐకేకేఎంఎస్ సభ్యులు

రైతులకు పరిహారం చెల్లించాలి: ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ,నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంస్థ తరఫున వర్షాల వల్ల వరి నష్టానికి పరిహారం చెల్లించాలని ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేసింది. శనివారం అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్‌కు అఖిల భారత రైతు కృషి కార్మికుల సంఘం(ఏఐకేకేఎంఎస్) వినతి పత్రం సమర్పించింది. ఈసందర్భంగా ఏఐకేకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతుల పరిస్థితి నేడు ఆందోళనకరంగా మారిందన్నారు. రాష్ట్రంలోని రైతులు నాలుగేళ్లుగా అతివృష్టి, అనావృష్టిలతో నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది ప్రాంరభంలోనే వర్షాలు సరిగ్గా కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలకొరిగి తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. మొక్కజొన్న, జొన్నలు, మిర్చి వంటి ఇతర పంటలు కూడా పూర్తిగా నష్టపోయే అవకాశం ఉందని, ఈ పరిస్థితిలో ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను ఆదుకోని పక్షంలో అన్నదాత తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. .వరికి రూ. 3500, మొక్కజొన్నకు రూ. 3000 మద్దతు ధర కల్పించాలని, పంటలన్నింటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 19న దేశ వ్యాప్తంగా పోరాటం చేపడ్తున్నామని, జిల్లా రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోవింద్,జిల్లా కార్యదర్శి గురల్లి రాజా, జిల్లా కమిటీ సభ్యులు ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉచ్చీరప్ప



ఉచ్చీరప్పను సన్మానిస్తున్న డైరెక్టర్లు

సిరుగుప్ప, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడిగా టెక్కలకోట ఉచ్చీరప్ప భారీ మెజార్టీతో గెలుపొందారు. శనివారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో ఎన్నికల అధికారి దేవేంద్రగౌడ్ ఆధ్వర్యంలో అధ్యక్ష, కోశాధికారి, రాష్ట్ర పరిషత్ సభ్యుల ఎంపికకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో 34 మంది డైరెక్టర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొమ్మిది ఓట్ల తేడాతో ప్రత్యర్థి అభ్యర్థి లింగరాజు రెడ్డిపై టెక్కలకోట ఉచ్చీరప్ప భారీ మెజార్టీతో గెలుపొందారు. అధ్యక్ష పదవికి నలుగురు బరిలో ఉన్నప్పటికీ మరో ఇద్దరు శివకుమార్‌కు రెండు ఓట్లు, అనితకు ఒక ఓటు దక్కింది. 20 మంది డైరెక్టర్లు ఉచ్చీరప్పకు ఓటు వేశారు. కోశాధికారిగా కొంచిగేరి ప్రభుత్వ పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు దుర్గప్ప ఎన్నికయ్యారు. రాష్ట్ర పరిషత్ సభ్యులుగా కరూరు ఆర్ఐ హనుమంతప్ప ఎన్నికయ్యారు. గెలుపొందిన వారికి డైరెక్టర్లు, ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ గంగాధర, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కంప్లి : కంప్లి, కురుగోడు తాలుకాలో శనివారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారుల నియామకం జరిగింది. కంప్లి నుంచి అధ్యక్షుడిగా దొడ్డ బసప్ప, కోశాధికారిగా నాసిర్ బాషా, రాష్ట్ర సంఘటన కమిటీ సభ్యులుగా విరుపాక్షప్పలు ఎన్నికయ్యారని అధికారి పక్కీరప్ప తెలిపారు. కురుగోడు పట్టణంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గుండప్ప నాగరాజు, కోశాధికారిగా నాగరాజు మసుతి, రాష్ట్ర సమితి సభ్యులుగా మంజునాథలు ఎన్నికైనట్లు అధికారి తిప్పేస్వామి తెలిపారు. కంప్లి, కురుగోడు తాలుకాలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు ఎన్నిక కావడంతో వారికి పలువురు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమంతప్ప, నాగన్నగౌడ, బసవరాజు, రమేష్, మారెప్ప, దేవన్న, తుకారామ్, గవిసిద్దప్ప స్వామి, శ్రీనివాస్, రాము, బసవరాజు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల నిరసన



కంప్లిలో ర్యాలీగా వెళ్తున్న రైతులు

కంప్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వరిధాన్యానికి ప్రభుత్వంగిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ, తాలుకా అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో కంప్లి పట్టణంలో సంగాత్రేయ పాఠశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో వరి ధాన్యాన్ని రోడ్డుపై పోసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాల వలన రైతు పూర్తిగా నష్టపోయారు. దీనికి తోడు గిట్టుబాటు ధరలు కూడా లేకుండా పోయాయి. తక్షణమే ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతు సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరి కాదన్నారు. పెట్టుబడులు పెరిగిపోయి రైతులు నష్టపోతున్నా గిట్టుబాటు ధర కలిప్పంచకపోవడం తగదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శివరాజ్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో మురారి, బసప్ప, ఏసీ దానప్ప, శరణ, మస్తాన్, హనుమంతు, సత్యనారాయణ, క్రిష్ణ, రంగప్ప, కొట్టూరు రమేష్, కరియప్ప, కంప్లి తాలుకా రైతులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

రాయచూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బస్సు ఢీ కొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. బైక్ పై వెళ్తున్న వ్యక్తిని వెనక్కి నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బైక్ పై వెళుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. శుక్రవారం రాత్రి రాయచూరు తాలూకాలోని నెలహాళ క్యాంప్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నెలహాళ క్యాంప్ నుంచి గ్రామంవైపు వెళ్తున్న భీమార్జున(52)ను వెనక్కి నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు కేఏ 36 ఎఫ్ 1362 బైకును ఢీ కొనడంతో కింద పడిన భీమార్జున తల నుజ్జునుజ్జైంది. తీవ్ర గాయాలతో అతడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ బస్సును అక్కడే వదిలేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న యరగేరా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హొసూరు జోన్

ఘనంగా ప్రత్యంగిరాదేవి హోమం

హొసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హొసూరు మోర్నపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన మహా ప్రత్యంగిరా దేవి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విశేషపూజలు కొనసాగాయి. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక యాగశాలలో మాంగళ్య దోష, పితృదోషం నివారణ పూజలు జరిపారు. హోమంలో ఎండు మిరపకాయలు వేయడం ప్రత్యేకత. ప్రతి అమవాస్య , పౌర్ణమి రోజున వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. అనంతరం సర్పదోషం, కల్యాణ దోష నివారణకు రాహుకేతు పరిహార పూజలు కూడా నిర్వహించారు. ఇలా ప్రత్యేక పూజలతో భక్తులతో సందడి నెలకొంది.



హోమంలో పాల్గొన్న భక్తులు

హాకీ టోర్నీలో హొసూరు విద్యార్థుల విజయం

హొసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో అన్నా యూనివర్సిటీ పరిధిలో అంతర కళాశాలల 2 రోజుల పురుషుల హాకీ పోటీలు జరిగాయి. 17 ప్రాంతీయ జట్లు పోటీల్లో పాల్గొన్నారు. హొసూరు అదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఫైనల్లో విజయం సాధించి రికార్డు సృష్టించారు. హాకీ పోటీల్లో విజయాలు సాధించిన విద్యార్థులను హొసూరు అదియమాన్ కళాశాల క్రీడా మైదానంలో కళాశాల డీన్ వెంకటేశ్ సెల్వం శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాధకృష్ణన్, మేనేజర్ నారాయణన్ ఉన్నారు.



అదియమాన్ కళాశాల విద్యార్థుల బృందం



ఓటరు జాబితా పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

ఓటరు జాబితా సవరణపై కలెక్టర్ సమీక్ష

హొసూరు(కృష్ణగిరి), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశంలో ఓటరు జాబితా సవరణపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సరయు నేతృత్వంలో శనివారం సమావేశం జరిగింది. ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా నియమితులైన గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆనందకుమార్ నేతృత్వంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కృష్ణగిరి జిల్లాలో ఎన్నికల జాబితా 2025 ప్రత్యేక సవరణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. కృష్ణగిరి జిల్లాలోని 6 పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారాలతోపాటు ఈనెల 23, 24 తేదీలలో 18ఏళ్ల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శాసనసభ నియోజకవర్గ పరిధిలోని 1,096 పోలింగ్ కేంద్రాలకు అనుబంధంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లు తమ గుర్తింపు కార్డులోని పేరు, చిరునామా ఇతర వివరాల దిద్దుబాటుకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే వీలుందని కలెక్టర్ తెలిపారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్ 04343-1950కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో హొసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ పన్నీర్ సెల్వం, ప్రత్యేక జిల్లా కలెక్టరు కె.సంపత్, జైశంకర్, పెరుమాళ్, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు ..



ఇబ్బంది పడుతున్న వాహనదారులు

హొసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలల్లో హొసూరు ఉదయం వేట విపరీతమైన చలి, పొగమంచు ప్రభావం ఉంటుంది. కొన్ని రోజులుగా హొసూరు పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్థమైంది. పొగమంచు కారణంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై హెడ్‌లైట్ల వెలుగులో వాహనాలు సంచరిస్తుంటాయి. శనివారం సాయంత్రం కూడా వర్షం కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో రెండు మూడు అడుగులమేర వర్షపు నీరు, మురుగునీటితో కలసి రోడ్డుపైకి చేరింది. దీంతో రోడ్డు పక్కన షాపులు, పాదచారులు, ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హొసూరు బాగలూరు రోడ్డులోని పాత మున్సిపల్ కార్యాయలం సమీపంలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో ఇతర ప్రాంతాల పరిస్థితి ఎలా ఉందోనని స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అవగాహన తప్పనిసరి



జీడిపప్పు మొక్కలను పంపిణీ చేస్తున్న ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సభ్యులు

కంప్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు పంట పెంపకంపై అవగాహన పెంచుకోవాలని ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ జిల్లా అధికారి రోహితాక్ష సూచించారు. కంప్లి తాలుకాలోని ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, పత్తి, మిరప, పంటలతో పాటు ఇతర పంటలపై కూడా ఆసక్తి ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం కంప్లి పట్టణంలో సోమప్ప చెరువు వద్ద వుండే కృష్ణప్ప రైతు ఇంటి వద్ద ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని తెలిపారు. రైతులు జీడిపప్పు పంట సాగుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సుమారు 600 జీడిపప్పు మొక్కలను రామసాగరం, హళే దరోజీ, ముద్దాపురం, కంప్లి ఇతర గ్రామాల రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాలుకా అధికారి హాలప్ప, వ్యవసాయ శాఖ అధికారి సంజు కుమార్, హనుమంతప్ప, శివరాజ్, రైతులు సత్యనారాయణ, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ,నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాపాలనా ,జిల్లాపంచాయతీ, జిల్లా న్యాయసేవల అథారిటీ, కార్మిక శాఖ, జిల్లా కార్మికుల పథకం సహకారంతో ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహించారు. శనివారం జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె, జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ పచ్చ జెండా చూపి యాత్రను ప్రారంభించారు. అంతర్జాతీయ దత్తత నెల నవంబరు 2024 భాగంగా చట్టపరమైన దత్తతపై డిప్యూటీ కలెక్టర్ ప్రతిజ్ఞ సందేశాన్ని బోధించారు. ఈసందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మీ, లేబర్ అధికారి సిద్దప్ప , జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ నాగప్ప, లేబర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పరశురాం, జిల్లా చైల్డ్ లేబర్ ప్రాజెక్ట్ ఏ.మౌనేశ్ తదితరులు పాల్గొన్నారు.